
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

సిద్దిపేట
5
శనివారం 27 ఏప్రిల్ 2024

రిజర్వేషన్ల రద్దుకు నరేంద్రమోదీ కుట్ర..!



అల్లాదుర్గం : రిజర్వేషన్లను రద్దు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కుట్ర చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరోపించారు. జనజాతర బహిరంగ సభలో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. రిజర్వేషన్ల కారణంగానే తాను ఉమ్మడి రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం మంత్రిగా కాగలిగానని అన్నారు. మనమందరం అప్రమత్తంగా ఉండి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రూ. 7.50 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు విమర్శించారు. రైతుబంధు కోసం రూ. 7వేల కోట్లు విడుదల చేశామని బీఆర్ఎస్ చెప్పడం అబద్ధమని, దమ్ముంటే ఆ డబ్బులు ఎక్కడికి పోయాయో చెప్పాలని డిమాండ్ చేశారు.





జన జాతర సభకు హాజరైన జనం

'ఖేడ్'లో ఫార్మా విలేజ్

విద్య, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం

- ఇచ్చిన మాట నిలుపుకోవడం కాంగ్రెస్ నైజం
- ఐదు గ్యారెంటీలు అమలు చేశాం
- ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 26 : ఉపాధి కల్పన కోసం నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జన జాతర సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ఖేడ్ నియోజకవర్గంలో 2వేల ఎకరాల భూమిని సేకరించి ఇస్తే నెల రోజుల్లోనే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట నిలుపుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు, గడీల పాలనను అంతమొందించడానికే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేను గెలిపించి, రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి సహకరించడంతోనే తాను సీఎంగా ప్రజల ముందు మాట్లాడగలుగుతున్నానని అన్నారు. ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ రాజ్యాన్ని అందిస్తున్న కాంగ్రెస్‌నే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఎల్బీ స్టేడియంలో 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని గుర్తు చేశారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. నీళ్లు, నిధులు, నియమకాల పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. తన కుటుంబ సభ్యులకు, బంధువులకే ఉద్యోగాలు కల్పించారని విమర్శించారు. కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఎమ్మెల్యేగా, ఎంపీగా ఈప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో మూడోతరంలో సురేష్‌షెట్కార్ ప్రజలకు సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. చిన్న పదవులనే వదులకోని కాలంలో తనకు వచ్చిన ఎమ్మెల్యే టికెట్‌ను ఆయన సంజీవరెడ్డికి ఇప్పించి స్నేహాన్ని చాటుకున్నారని అన్నారు. ఆయన త్యాగాన్ని గుర్తించి ఈ ఎన్నికల్లో ఆయనను లక్ష మెజారిటీతో ఎంపీగా గెలిపించాలని కోరారు.



మహిళా ఐటీఐ ఏర్పాటు చేస్తాం..

నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినందుకు సీఎం అభినందించారు. ఈ ప్రాంత విద్యార్థుల కోసం 24/7 పనిచేసేలా లైబ్రరీని నిర్మించడానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. మహిళల ఐటీఐని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు పట్లోళ్ల సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, మాజీ మంత్రులు మండవ వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఎనుగు రవీందర్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస శ్రీనివాస్, యూసుఫ్‌అలీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ మాదిరిగా అభివృద్ధి చేయండి

ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని కొడంగల్ మాదిరిగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు 8 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కారణంగా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పిట్టల దొరగా మారాడని, కేటీఆర్, హరీశ్‌రావులు రాజీనామా డ్రామాలతో తుపాకీ రాముళ్లలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జహీరాబాద్ ఎంపీగా తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించాలని సురేష్ షెట్కార్ కోరారు. సంగారెడ్డి-ముంబై హైవే అభివృద్ధి చేయించామని, సంగారెడ్డి-అకోలా హైవే 161ను ఏర్పాటుకు జీవో తీసుకువచ్చానన్నారు. ఎల్లారెడ్డి, నారాయణఖేడ్‌లలో మోడల్ డిగ్రీ కళాశాలు, 15 మోడల్ స్కూళ్లు, జహీరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయించానని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న మహిళ



జనజాతర సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు


కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట/అల్లాదుర్గం, ఏప్రిల్ 26: నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పెద్దశంకరంపేటలో నిర్వహించిన జన జాతర సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సభకు నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డి, అందోల్, జహీరాబాద్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉన్నా మూడు గంటలు ఆలస్యమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో 6.20కు పెద్దశంకరంపేటకు చేరుకున్నారు. సభావేదిక వద్దకు 7 గంటలకు చేరుకున్నారు. 8.30 గంటల వరకు సభ కొనసాగింది. సభ ఆలస్యమయినప్పటికీ కార్యకర్తలు నిరుత్సాహం చెందలేదు. టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నగేష్ షెట్కార్, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ తొలి స్థానిక ఎంపీ
అందోలువాసి

- 1984లో డాకూరు మాణిక్‌రెడ్డి గెలుపు
- కాంగ్రెస్ నేత శివశంకర్‌పై విజయం
- జెయింట్ కిల్లర్‌గా గుర్తింపు

జ్ఞాపకం



జోగిపేట, ఏప్రిల్ 26: మెదక్ లోక్‌సభ నియోజకవర్గం.. ఇందిరాగాంధీని గెలిపించి దేశమంతా ప్రాచుర్యం పొందింది. ఇందిర దుర్మరణం అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌లో నంబర్-2 నేతగా పేరున్న శివంకర్‌ని పోటీకి నిలిపితే తిరస్కరించి స్థానికుడిని గెలిపించిన చరిత్ర కూడా ఈ నియోజకవర్గానికి ఉన్నది. ఎప్పుడూ స్థానికేతరులే పోటీచేసి గెలుపొందే ఆనవాయితీకి అందోలు మండలం డాకూరువాసి పట్లోళ్ల మాణిక్‌రెడ్డి బ్రేక్ చేశారు. పునర్విభజనకు ముందు మెదక్, అందోలు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, నిజమాబాద్ జిల్లా పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లతో మెదక్ లోక్‌సభ నియోజకవర్గంగా ఉండేది. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో స్థానికేతరుడైన ఎస్ఎం జయసూర్య పీపుల్స్ డెమోక్రటిక్‌ఫ్రంట్ తరఫున పోటీచేసి ఎంపీగా గెలుపొందారు. 1957, 1962ల్లో కాంగ్రెస్‌కు చెందిన పి.హనుమంతరావు గెలిచారు. 1971, 1977ల్లో తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రజా సమితి తరఫున పోటీచేసిన మల్లిఖార్జున్‌గౌడ్ విజయం సాధించారు. ఎమర్జెన్సీ అనంతరం 1980లో కేంద్రంలో జనతా ప్రభుత్వం విఫలమవ్వడంతో పార్లమెంట్‌కు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అంతకుముందు ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఓటమిపాలయిన కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధీ దక్షిణాదిలోనూ పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న మెదక్ పార్లమెంట్ సీటు నుంచి ఇందిర పోటీచేసి విజయం సాధించారు.

ఇందిర అనంతరం తారుమారు

ఇందిర హత్యానంతరం 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశమంతా కాంగ్రెస్ హవా నడిచింది. కానీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్‌ను కాదని స్థానికుడిని ఆదరించారు. అప్పట్లో దేశ రాజకీయాల్లో ఇందిర తరువాత నంబర్-2గా పేరున్న శివశంకర్ ఆ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేశారు. అయితే, అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయ సంచలనంలా దూసుకువచ్చిన తెలుగుదేశం తరఫున మెదక్ నుంచి డాకూరుకు చెందిన యువనాయకుడు పట్లోళ్ల మాణిక్‌రెడ్డి బరిలో నిలిచారు. అప్పటివరకు స్థానికేతరుల హవా నడిచిన ఈ నియోజకవర్గంలో స్థానిక నినాదం, టీడీపీ జోరు కలిసి మాణిక్‌రెడ్డి సంచలన విజయం సాధించారు. దేశమంతా ఇందిర హత్య తరువాత వెల్లువెత్తిన సానుభూతి పవనాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తే.. మెదక్‌లో ఆ పార్టీ అభ్యర్థి అనూహ్య ఓటమి చవిచూశారు. శివశంకర్‌ను ఓడించిన మాణిక్‌రెడ్డి జెయింట్ కిల్లర్‌గా వార్తల్లో నిలిచారు. ఢిల్లీలో తనకు ప్రత్యేకంగా చూసేవారని మాణిక్‌రెడ్డి చెప్పేవారు. అనంతరం ఆయన మరో రెండుసార్లు పోటీ చేసినా గెలుపు సాధించలేకపోయారు.

నాలుగుసార్లు కార్పొరేషన్ చైర్మన్

మెదక్‌లో సంచలన విజయం అనంతరం మాణిక్‌రెడ్డి పార్టీలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. చంద్రబాబు హయాంలో ఆయన నాలుగుసార్లు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రెండుసార్లు ఉమ్మడి రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ (ఏపీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్‌గా, మరో రెండుసార్లు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) చైర్మన్‌గా నియమితులయ్యారు. తెలంగాణ వచ్చిన అనంతరం బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌కు ఆప్తుడిగా మెదిలారు. గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మాణిక్‌రెడ్డి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా, అందోల్ పంచాయతీ సమితి ప్రెసిడెంట్‌గా, ఎంపీగా, కార్పొరేషన్ చైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. 2018 ఆగస్టు 18న ఆయన మృతిచెందేవరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యంత సీనియర్ నాయకుడిగా, రాజకీయ పార్టీలకు పెద్ద దిక్కుగా వ్యవహరించారు.



టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి హోదాలో అప్పటి సీఎం చంద్రబాబుతో మాణిక్‌రెడ్డి (ఫైల్)

మెదక్‌లో 53, జహీరాబాద్‌లో 26

- నామినేషన్లను ఆమోదించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు
- సరైన పత్రాలు సమర్పించకపోవడంతో మెదక్‌లో ఒకటి, జహీరాబాద్‌లో 14 తిరస్కరణ

మెదక్/సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 26: మెదక్ పార్లమెంట్‌కు సంబంధించిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో పూర్తయింది. మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా 53 నామినేషన్లను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థి కళ్లు నర్సింహులుగౌడ్ సరైన పత్రాలను సమర్పించకపోవడంతో తిరస్కరించారు. కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నేతలు, అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామినేషన్ల పరిశీలనలో అవలంబిస్తున్న విధివిధానాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ అభ్యర్థులకు వివరించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తనకు తెలియజేయాలని సూచించారు. శనివారం సెలవు దినం కావడంతో నామినేషన్లను ఉపసంహరించుకునే వారు శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి ఉపసంహరణ ఫారాలను అందజేయవచ్చన్నారు. సోమవారం కూడా సమర్పించవచ్చని సూచించారు. అలాగే, నామినేషన్ వేసిన అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాలని చెప్పారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినపుడు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. ఈవీఎం, సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. 85 ఏళ్లు దాటిన వయో వృద్ధులు, 40శాతం పైబడిన దివ్యాంగులకు ఫారం-12డీని అందజేసినట్లు చెప్పారు. వారికి ఏ రోజు హోం ఓటింగ్ ఉంటుందనే వివరాలను అందజేశామని, బూత్‌లెవల్ ఏజెంట్లు హాజరై ఓటింగ్ ప్రకియను పరిశీలించవచ్చని ఆయన తెలిపారు.



నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

నర్సాపూర్, మెదక్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం, మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెదక్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. ఇక, ప్రతిరోజూ నివేదికల మీద రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతకాలు చేయాల్సి ఉంటుందని ఆయన సూచించారు. నీలం మధు (కాంగ్రెస్), రఘునందన్‌రావు (బీజేపీ), వెంకట్రామారెడ్డి (బీఆర్ఎస్)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు. మూడుసార్లు పత్రికల్లో వారికి ఇచ్చిన సీ1, సీ2, సీ3, ప్రొఫార్మాలను ప్రచురించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన తేదీలను కూడా నామినేషన్ పత్రాలను దాఖలు చేసినపుడు తెలియజేశామన్నారు. సభలు, ర్యాలీలు నిర్వహించే సమయంలో తప్పని సరిగా ఏఆర్వో నర్సాపూర్, ఏఆర్వో మెదక్ వద్ద 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలని, సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనుమతి తీసుకోకుంటే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి పాల్గొన్నారు.

జహీరాబాద్..

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. మొత్తం 40 మంది అభ్యర్థులు 68 సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో 14 మంది అభ్యర్థులకు సంబంధించిన 18 సెట్ల నామినేషన్లను తిరస్కరించినట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్ జితివారి సమక్షంలో నామినేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో నామినేషన్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

బోర్డులు ఘనం.. ఆటలు శూన్యం

- నిరుపయోగంగా గ్రామీణ క్రీడామైదానాలు
- క్రీడాసామగ్రి లేక ఆసక్తి చూపని విద్యార్థులు

సిద్దిపేటఅగ్రికల్చర్, ఏప్రిల్ 26: చెరువు గట్టు.. శ్మశానాలు.. గుట్ట ప్రాంతాలు.. బురద గుంటలు, డంపింగ్‌యార్డులు.. ఇలా కావేవీ నేమ్ బోర్డులకు అనర్హం అనుకున్నారో ఏమో..? మన అధికారులు ఎక్కడ పడితే అక్కడ క్రీడాప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేశారు. రికార్డుల్లో నిధులు భారీగా ఖర్చు చేసినట్లు లెక్కలు చెప్పారు కానీ, ఎక్కడా కూడా ఆటలు ఆడడానికి అనువుగా మైదానాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. మరికొన్నిచోట్ల పాఠశాల మైదానాలు, ఇతర అనువైన ప్రాంతాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినా అవి కూడా నిరుపయోగమే. గ్రామం మొత్తానికి ఒక వాలీబాల్ కిట్, క్రికెట్ కిట్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆటలు నేర్చుకుందామనుకునే వారికి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. క్రీడాప్రాంగణాలు చూస్తే అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

రూ. 20.3 కోట్లతో వ్యయంతో..

రెండేళ్ల కిందట మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంగణాన్ని అరెకరం, ఎకరం ప్రభుత్వ స్థలంలో రూ.4.17 లక్షలతో నిర్మించారు. ఇందులో రూ. 30 వేలతో ప్రాంగణం పేరిట స్వాగత తోరణానికి ఖర్చు చేశారు. కిట్లను జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 499 పంచాయతీ ఉన్నాయి. అందులో ముంపు గ్రామాలు పోను 487 గ్రామపంచాయతీల్లో 447 ప్రాంగణాలను పూర్తి చేశారు. ఒక్కో చోట గరిష్ఠంగా రూ. 4.17 లక్షల చొప్పున మొత్తం దాదాపు రూ. 20.3 కోట్లు వెచ్చించారు. వీటితో ఒక బోర్డు, కసరత్తులు చేసే ఇనుప రాడ్లు, కొన్ని చోట్ల వాలీబాల్ కోర్టులు వేసి చేతులు దులుపుకున్నారు. ఒక్కో ప్రాంగణానికి రూ.60వేలతో వాలీబాల్, క్రికెట్ కిట్‌లు అందజేశారు. క్రీడా ప్రాంగణాల చుట్టూ వేప, గుల్మొర్, కానుగ, చింతతో పాటు పలురకాల నీడనిచ్చే మొక్కలు నాటాలి. వాటిని ఎక్కడా నాటలేదు. కొన్ని చోట్ల ఎండిపోయాయి. కొన్నింటిని పశువులు మేయడం మైదానాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. కొన్ని క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా ఉండడంతో ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలలో అందుబాటులోకి తేవాలని గ్రామీణ క్రీడాకారులు, విద్యార్థులు కోరుకుంటున్నారు.



చేర్యాల మండలం అర్జున్‌పట్లలో బోర్డుకే పరిమితమైన క్రీడాప్రాంగణం

ముగిసిన రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ

ఏడు నియోజకవర్గాలకు 3,540 మంది సిబ్బంది కేటాయింపు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 26: పోలింగ్ పర్సన్ రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్‌కుర్కోటీ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సమక్షంలో శుక్రవారం ముగిసింది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించి, సిబ్బందిని కేటాయించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు మొత్తం 3,540 మందిని ఆయా సెగ్మెంట్లకు కేటాయించినట్లు తెలిపారు. వీరికి త్వరలో ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కేటాయించిన సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ జరిగే రోజు మూడో విడత ర్యాండమైజేన్ ప్రక్రియలో బూత్‌ల వారీగా సిబ్బందిని కేటాయిస్తామని ఆయన వెల్లడించారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయొచ్చు

మెదక్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 26 : ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే పరిశీలకులను నేరుగా కలిసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి ఫోన్ నంబర్ 9652875704కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. పార్లమెంట్ స్థానానికి సంబంధించి అభ్యర్థుల ఖర్చుల విషయంలో ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్‌కుమార్ 9871794793 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.9.28 లక్షల పట్టివేత



హుసెల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ నగదు

జహీరాబాద్, ఏప్రిల్ 26 : జహీరాబాద్ పట్టణం, నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాతాల్లో రూ.9.28లక్షల నగదును పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని రైల్వేగేటు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో మాడ్గి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.4.50 లక్షలను తీసుకెళ్తుండగా, ఎలాంటి పత్రాలు లేనందున పట్టుబడిన నగదును సీజ్‌చేసి ఎన్నికల అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. చిరాగ్‌పల్లి బార్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.70వేలు పట్టుబడ్డాయని ఎస్‌ఐ నరేష్ తెలిపారు. అలాగే న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి బార్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా రూ.1.98 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోహీర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద వాహనాల తనిఖీల్లో రూ.2.10 లక్షలు పట్టుబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో పట్టుబడిన నగదుకు సంబంధించిన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసి ఎన్నికల అధికారులకు పంపించినట్లు అధికారులు వివరించారు.

రాయపోల్‌లో రూ.రెండు లక్షలు, బంగారం పట్టివేత

రాయపోల్, ఏప్రిల్ 26: వాహనాల తనిఖీల్లో నగదు, బంగారం పట్టుకున్న సంఘటన రాయపోల్‌లో చోటుచేసుకున్నది. శుక్రవారం రాత్రి తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి సిబ్బందితో కలిసి కొత్తపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు వాహనాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2.30 లక్షల నగదు, 139.19 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని వెళుతుండగా సీజ్ చేశారు. డబ్బు, బంగారాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్‌సెల్‌లో డిపాజిట్ చేశామని పేర్కొన్నారు.

నీళ్లు, కరెంట్ ఉన్నా ఇవ్వలేని దుస్థితి

● ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో సరిపడా సాగు నీరు, విద్యుత్ ఉన్నప్పటికీ సరఫరా చేయలేని స్థితి నెలకొన్నదని, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి ఆరోపించారు. జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లికి విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు కాటకాలతో తల్లడిల్లిన రాష్ట్రంలో గోదావరి జలాలు పారించి తాగు, సాగు నీటి గోస తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లేని లోటు నేడు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో ముప్పై ఏళ్లు ముందుకు వెళ్లిందని పేర్కొన్నారు. మాయమాటలు చెప్పిన రఘునందన్‌రావుకు దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పారని, ఎంపీ ఎన్నికల్లోనూ ఆయనకు ఘోర పరాభవం తప్పదన్నారు. జగదేవ్‌పూర్ ప్రజలతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ శ్రేణులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేశిరెడ్డి నర్సింహారెడ్డి, గుండ రంగారెడ్డి, ఎంపీటీసీ కొత్త కవిత శ్రీనివాస్‌రెడ్డి, ఎక్బాల్, బట్టు సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ డిపోలో రూ.లక్ష అదనపు ఆదాయమే లక్ష్యం

● ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26 : ప్రతీ రోజు.. ప్రతీ డిపోలో రూ.లక్ష అదనపు ఆదాయమే ఉద్యోగుల లక్ష్యం కావాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ సూచించారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు శుక్రవారం పురస్కారాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ ప్రతీ డిపోలో రోజూ రూ.లక్ష అదనపు ఆదాయం తీసుకురావడం ద్వారా ఉద్యోగుల జీతాలకు అదనపు భారం పడకుండా 'లక్షే లక్ష్యం' కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రతీ కండక్టర్, డ్రైవర్ ట్రిప్‌లో రూ.100 నుంచి 1000 వరకు అదనంగా కలెక్షన్ తీసుకురావాలని కోరారు. గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను అందరు ఉద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మూడో, నాల్గో త్రైమాసికంలో భాగంగా అవార్డులు తీసుకున్న ఉద్యోగులకు ఈడీ మెమెంటో శాలువాలతో సత్కరించి క్యాష్ అవార్డులను అందజేశారు. డిపోలో ఉత్తమ ప్రతిభ కనబచ్చిన 20 మంది డ్రైవర్లు, ఆరుగురు టీం డ్రైవర్లు, 14 మంది కండక్టర్లు, 10 మంది గ్యారేజ్ మెకానిక్, 10 మంది అద్దె బస్సుల డ్రైవర్లను ఈడీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్ఎంలు దైవాధీనం, జ్యోత్స్న, సంగారెడ్డి డీఎం ఉపేందర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వగరు, తీపి, పులుపు మేళవింపుతో రుచిగా ఉండే అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. చలువ చేసే ఈ పండ్లు ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. కానీ ధర మాత్రం దడేల్ అనిపిస్తుంది. శుక్రవారం హుస్నాబాద్ సంతలో అల్లనేరేడు పండ్లు విక్రయానికి వచ్చాయి. చాలా మంది కొనేందుకు ఉత్సాహం చూపారు. కానీ, కిలో రూ.200 అంటూ చెప్పేసరికి ఉసూరుమన్నారు. - హుస్నాబాద్, ఏప్రిల్ 26



ఆయిల్‌పామ్ పెంపకానికి సమన్వయంతో పనిచేయాలి

● తోటల విస్తీర్ణంలో మూడో స్థానంలో సిద్దిపేట జిల్లా

● రాష్ట్ర హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్, ఆయిల్ ఫెడ్ ఎండీ అశోక్ రెడ్డి



మాట్లాడుతున్న ఆయిల్ ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 26 : సిద్దిపేట జిల్లాలో ఈ ఏడాది నిర్దేశించిన ఏడు వేల ఎకరాల లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్, ఆయిల్ ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంగునూరు మండలం నర్మెట్టలో పర్యటించి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జూన్ వరకు జిల్లాలో వచ్చే ఆయిల్‌పామ్ పంటను రైతుల నుంచి స్వీకరించేందుకు ఫ్యాక్టరీ వద్ద కలెక్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి పంపించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఉద్యానవన, వ్యవసాయ, ఆయిల్ ఫెడ్, మైక్రో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో పామాయిల్ తోటల పెంపకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి చాలా అవకాశాలు ఉన్నాయని, తోటల విస్తీర్ణంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల తర్వాత 11,140 ఎకరాలతో సిద్దిపేట జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. అలాగే నర్మెట్టలో రూ.300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ కూడా నిర్మాణం జరుగుతున్నందున రైతులు పండించిన పామాయిల్ పంట మార్కెటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. పామాయిల్ తోటల్లో అంతర పంటలను వేయడం ద్వారా అదనపు ఆదాయం పొందేలా రైతుల ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను, పామాయిల్ తోటలను ఉన్నతాధికారులు తరచుగా సందర్శించి పర్యవేక్షించాలన్నారు. అంతకుముందు రంగనాయకసాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన, హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి : ఉద్యాన శాఖ అధికారి సమత

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 26 : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు జాగ్రత్తలు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని ఉద్యానవన శాఖ అధికారి సమత అన్నారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 569 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారని తెలిపారు. వేసవి కాలంలో ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా వేసిన ఆయిల్‌పామ్ పంటలను కాపాడుకుంటూ మంచి దిగుబడి సాధించేందుకు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుము, పచ్చరొట్ట ఎరువు పంట నాటుకోవాలని సూచించారు. జనుము పూతకు వచ్చిన వెంటనే చిన్న ముక్కలుగా కోసి వాటి చుట్టూ వేయాలని సూచించారు. వేసవి కాలంలో చిన్న మొక్కలకు రోజు 150 నుంచి 165 లీటర్ల నీటిని అందించాలన్నారు. అవసరం మేరకు మాత్రమే ఎండిన, విరిగిన లేదా చీడపీడలు ఆశించిన ఆకులను మాత్రమే తొలగించాలని, వృథాగా పచ్చి ఆకులను నరకవద్దని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటలు వేసినట్లయితే వాటికి కూడా సిఫారసు మేరకు నీరు తప్పనిసరిగా అందేలా చూసుకోవాలన్నారు. మైక్రోజెట్ కన్నా కూడా వేసవిలో డ్రిప్పర్లు వాడినట్లయితే బాష్పోత్సవం ద్వారా నీరు త్వరగా ఆవిరి కాకుండా ఉంటుందని సూచించారు. వేసవిలో ఆయిల్‌పామ్ తోటల్లో ఎలాంటి దుక్కులు దున్నరాదని, అందుబాటులో ఉన్న నీటిని ఒకేసారి కాకుండా దశల వారీగా అందించాలని ఆమె వెల్లడించారు. అనంతరం జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులందరూ అధికారులు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నీటి కొరత వల్ల మొక్కలకు ఎలాంటి నష్టం జరగదని, ఒకవేళ క్లిష్ట పరిస్థితుల్లో ఏదైన నష్టం వాటిల్లినా నీరు అందుబాటులోకి వచ్చిన తరువాత మొక్కలు మళ్లీ కుదురుకుంటాయన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఎలాంటి అపోహలు, అనుమానాలకు గురికావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు బి.శైలజ, కీర్తికృష్ణ, స్పందన, పి.శైలజ, ఆయిల్‌పామ్ కంపెనీ సిబ్బంది వెంకటేశ్వర్లు, భరత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

హరీశ్, రేవంత్‌లది కొత్త నాటకం

● దొంగా, చీకటి ఒకటైనట్లు ఇద్దరూ కలిసి బీజేపీపై కుట్రలు

● మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



నిజాంపేటలో నిర్వహించిన ర్యాలీ



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

నిజాంపేట, ఏప్రిల్ 26 : మీడియా, ప్రజల దృష్టి మళ్లించడం కోసం హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి కొత్త నాటకాలు మొదలుపెట్టారని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. మార్చి 19న ఢిల్లీ నుంచి వారు ఇద్దరు హైదరాబాద్‌కు వస్తూ బిజినెస్ క్లాసులో మాట్లాడుకుని దొంగా, చీకటి ఒకటైనట్లు కలిసి బీజేపీ పార్టీపై కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో రఘునందన్‌రావు మాట్లాడారు. ఐదేళ్ల అధికారంలో ఉండి రూ.లక్ష రుణమాఫీ చేయడం చేతకాని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాసి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరాలన్నారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డికి సవాలు విసురుతూ మీడియా అటెన్షన్ అంతా ఇద్దరి మీద ఉండేటట్లు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు తప్ప అందులో వాస్తవం లేదన్నారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక ఆడుతున్న నాటకం అని, వీళ్ల మాటలు ప్రజలు నమ్మరని, ఓబీసీ, అగ్రవర్ణ పేదల కోసం రిజర్వేషన్లు ఉండాలని కోరుకున్న పార్టీ బీజేపీ అని తెలిపారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని... దాంట్లో వాస్తవం లేదని రఘునందన్‌రావు స్పష్టంచేశారు. పదేళ్ల నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏనాడు రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పలేదని తెలిపారు. మూడోసారి వచ్చేది బీజేపీ అని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని, మెదక్ ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసుకుందామన్నారు. బూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తా అని చెప్పి, దేవుళ్లపై ప్రమాణాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రమేష్, నరేష్ మహంకాళి, పోచయ్య, జిపి.స్వామి తదితరులు ఉన్నారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

● భవిష్యత్ కోసం బీజేపీని గెలిపించండి

● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మాసాయిపేట, ఏప్రిల్ 26: వర్గీకరణకు సహకరిస్తామని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కల్లబొల్లి మాటలు చెప్పి చెరో పదేళ్లు మోసం చేశాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వారు ఇచ్చిన హామీల పేపర్ కటింగ్‌లను ప్రదర్శించారు. మాదిగల భవిష్యత్ కోసం.. ఎమ్మార్పీఎస్ చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తామన్న బీజేపీని ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా మాసాయిపేటలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మెదక్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఎమ్మార్పీఎస్‌ను అణచివేస్తామని పేర్కొంటూనే, మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ పదేళ్ల అధికారంలో ఉండీ కూడా వర్గీకరణకు అనుకూలంగా కనీసం ఒక ప్రకటన కూడా చేయలేదన్నారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీ ఎస్సీల వర్గీకరణకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, చెట్లపల్లి యాదగిరి మాదిగ, రాములు మాదిగ, మురళీ మాదిగ, గుడ్డి శోభ మాదిగ, బీజేపీ నాయకులు పాపన్నగారి వేణుయాదవ్, వేణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

బీజేపీతోనే దేశాభివృద్ధి

● జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్



హుగ్గెల్లిలో బీబీ పాటిల్‌కు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

జహీరాబాద్, ఏప్రిల్ 26 : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమైతుందని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి, శేఖాపూర్, గోవింద్‌పూర్, మల్‌చెల్మ, హోతి(బి), బూర్దిపాడ్, బూచనెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి, మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి, గొటిగార్‌పల్లి, ఖాంజామాల్‌పూర్, మాడ్గి, ధనసిరి, గౌసాబాద్, మొగుడంపల్లి, గుడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఎంతగానో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న నేపథ్యంలో మరోమారు బీజేపీ గెలుపు కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తాను బరిలో ఉన్నానని, నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలన్నారు. గడిచిన పదేళ్ల కాలంగా జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, బీజేపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌ట్యాపింగ్‌లో కేసీఆర్, కేటీఆర్ జైలుకే

● అయోధ్యలో సీతమ్మ విగ్రహం ఎందుకు ప్రతిష్ఠించలేదు

● దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



అభివాదం తెలుపుతున్న మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 26 : లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్లిందని, రాబోయే రోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌తో పాటు కేసీఆర్, ఇంకా బాధ్యులైన వారు జైలుకు వెళ్లడం ఖాయమని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రాత్రి సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రాన్ని నట్టేటా ముంచారని మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర ఖజానా లేకపోవడంతో, సర్కారుని నడపడం ఎంత కష్టంగా ఉందో ఒక మంత్రిగా తనకు తెలుసునన్నారు. అయినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతిని హామీని అమలు చేసి తీరుతామని చెప్పారు. మూడు నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేసి చూపించామన్నారు. కేటీఆర్ నాన్న కేసీఆర్ మాట్లాడే భాషనే మాట్లాడుతున్నామని, ఆ భాష నేర్పింది మీరే కదా అన్నారు. సిద్దిపేట హరీశ్ అడ్డాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం బాధాకరమన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన మోదీ, సీతమ్మ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో మోదీ అదానీ, అంబానీలకు దోచి పెట్టారని మండిపడ్డారు. రఘునందన్‌రావు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పని చేసిన వెంకట్రామారెడ్డి దౌర్జన్యం చేసి రైతుల భూమిని తీసుకొని కేసీఆర్ ప్రభుత్వానికి అప్పగించారని మండిపడ్డారు. అందుకే కేసీఆర్ కాలు మొక్కి ఎమ్మెల్సీ అయ్యారని, ఇప్పుడు ఎంపీ టికెట్ తెచ్చుకున్న వెంకట్రామారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ వస్తే కవిత జైలు నుంచి బయటికి వస్తుందని, కాంగ్రెస్ వస్తే రాదన్న భయం బీఆర్ఎస్‌కు పట్టుకుందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు పాంచ్ న్యాయ్‌ను రాహుల్‌గాంధీ అమలు చేస్తారని చెప్పారు. ఆగస్టు 15న రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేసి తీరుతామని, అప్పటివరకు హరీశ్‌రావు రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండాలని సూచించారు. బీసీ బిడ్డ నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణంలో అగ్నిప్రమాదం

● సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం



ఫర్టిలైజర్ షాపులో మంటలు వ్యాపించడంతో దగ్ధమైన రసాయనాలు, విత్తనాలు

చేర్యాల, ఏప్రిల్ 26 : చేర్యాల పట్టణ శివారు కడవేరుగు క్రాస్ రోడ్డు సమీపంలోని జ్యోతి ఫర్టిలైజర్‌షాప్‌లో ప్రమాదవశాత్తు శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. రోజువారీలాగే లావాదేవీలు ముగించుకుని యాజమాని షాపునకు తాళం వేసి వెళ్లిపోయిన కొద్దిసేపటి తరువాత విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో రసాయనాలు, ఎరువులకు నిప్పంటుకుని షాపులో నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం అందించి మంటలు ఆర్పడానికి యత్నించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి సమీపంలోని బైక్ మెకానిక్ షాపులో నుంచి బకెట్లలో నీటిని తీసుకువచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపకశాఖ అధికారులకు ఫోన్ చేసినా ఆలస్యం జరిగింది. అగ్నిప్రమాదంతో సుమారు రూ.4లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు చెబుతున్నారు. వెనువెంటనే చుట్టుపక్కలవారు గమనించకుండా మంటలు ఆర్పి వేయకుంటే పెనుప్రమాదం జరిగి ఉండేది.

రూ. 50వేలకు మించి నగదు ఉంటే రసీదు తప్పనిసరి

● కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 26: వాహనదారులు రూ. 50వేల కంటే ఎక్కువ నగదును తరలించాలంటే కచ్చితంగా రసీదు కలిగి ఉండాలని, లేదంటే డబ్బును సీజ్ చేస్తామని కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ తెలిపారు. శుక్రవారం రాజీవ్ రహదారిపై లకుడారం స్టేజీ వద్ద ఆయన కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌తో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులందరూ ఎన్నికల నియమనిబంధనలు పాటించాలని, ఏ ఒక్కరి వద్ద రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు ఉండరాదని, ఎక్కువ నగదును కలిగి ఉంటే వాటికి తగిన రసీదులను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట ఏఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బస్సు రద్దుతో ఇబ్బందులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 26: హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం 5 గంటలకు బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సును, ఇరవై రోజులుగా రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేదన్నారు. డిపో మేనేజర్‌కు హుస్నాబాద్ ప్రాంత రూట్లపై అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే ఆ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కనుల పండువగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

● అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు



చేర్యాల: బండపల్లి కాలనీలో దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు



చేర్యాల: ఆకునూరులో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 26: చేర్యాల పట్టణంలోని బండపల్లి కాలనీవాసులు నిర్మించుకున్న దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం కన్నులపండువగా జరిగింది. సంప్రదాయబద్ధంగా యంత్రప్రతిష్ఠ నిర్వహించి అమ్మవారిని ప్రతిష్ఠించారు. కాలనీవాసులు అమ్మవారిని దర్శించుకుని తమ పాడిపంటలు చల్లగా కాపాడమని వేడుకుని ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా రాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. అనురాధ నక్షత్రయుక్త మిథునలగ్న సుముహూర్తమున స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన పూజలు చేశారు. వేడుకలకు హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీహోమం

ఆకునూరు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం గౌడకులసంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మొదటిరోజున ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం చండీహోమం నిర్వహించారు. రేపు అమ్మవారికి బోనాలు సమర్పించడంతో పాటు మంగళవారం అమ్మవారి కళ్యాణం జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు

అక్కన్నపేట, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ ప్రతిష్ఠ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణ రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, స్థానిక మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు స్థానిక ఎంపీటీసీ పెసరు సాంబరాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కందుల రాంరెడ్డి, నాయకులు నక్క రాజు పాల్గొన్నారు.

లద్నూరులో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

మద్దూరు, ఏప్రిల్ 26: మండలంలోని లద్నూరులో శ్రీభూలక్ష్మీ శ్రీ మహాలక్ష్మీ సమేత నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం వేద బ్రాహ్మణుల, పంబాల పూజారుల ప్రత్యేక పూజా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం మైలపట్నం, లగ్నపట్నం నిర్వహించి, ఘటం తీసుకువచ్చిన తదనంతరం బోనాల సమర్పణతో పాటు కథా కాలక్షేపం నిర్వహించారు. జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి బొడ్రాయిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం

గజ్వేల్, ఏప్రిల్ 26: సీతారామ, ఉమామహేశ్వరుల కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం చేసినట్లు రామకోటి భక్త సమాజ అధ్యక్షుడు రామరాజు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని శేషసాయి మోక్షమందిరంలో గోటి తలంబ్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచల సీతారాముల కల్యాణానికి 150కిలోల గోటి తలంబ్రాలను అందించిన ఘనత తమ సంస్థకే దక్కిందన్నారు. గజ్వేల్‌లో జరిగే సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు అందజేయాలని కోరిన మేరకు తలంబ్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయనవెంట మునిసిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, యెల్లు రాంరెడ్డి, శేషసాయి మోక్షమందిరం భక్తులు ఉన్నారు.



మద్దూరు: లద్నూరులో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న జడ్పీటీసీ

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

దౌల్తాబాద్, ఏప్రిల్ 26: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని దొమ్మాట గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్దచేప్యాలకు చెందిన అక్కరాజు నర్సింహులు(35) గురువారం రాత్రి బైక్‌పై, దొమ్మాట గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. చేప్యాలకు చెందిన అక్కరాజు బాబు, అల్వాల్‌కు చెందిన బబ్లు బైక్‌పై చేప్యాల నుంచి దొమ్మాటకు వస్తున్నారు. బాబు బైక్‌ను అజాగ్రత్తగా నడిపి దొమ్మాట సమీపంలో నర్సింహులు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో అక్కరాజు నర్సింహులు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అక్కరాజు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలకు సంబంధించిన బియ్యం స్వాధీనం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 26: జిల్లెలగడ్డ గిరిజన గురుకుల పాఠశాల నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో హుస్నాబాద్ పోలీసులు పట్టణంలోని ఓ ఇంట్లో తనిఖీ చేయగా, పాఠశాలకు సంబంధించిన బియ్యం, పప్పులతో పాటు నిత్యావసర సరకులను స్వాధీనం చేసుకుని హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం ఎంతనేది ఇంకా వెల్లడికాలేదు. ఈ విషయాన్ని పాఠశాలకు సంబంధించిన అధికారులకు తెలియజేశామని, వారి ఫిర్యాదు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తోట మహేష్ తెలిపారు.

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జిల్లెలగడ్డ గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పీఈటీ, అటెండర్ సహకారంతో భారీగా బియ్యాని మాయం చేశారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గడిపె మల్లేశం డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వేసవిలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

కొండపాక, ఏప్రిల్ 26: రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సీనియర్ హోమియోపతి వైద్యుడు వల్లకోటి దేవేందర్ అన్నారు. కొండపాకలోని ఆనంద నిలయంలో వృద్ధులకు ఉచితంగా వడ దెబ్బ నివారణ కోసం ముందస్తు హోమియోపతి మందులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల నుంచి పలు వృద్ధ, అనాథ పిల్లల ఆశ్రమల్లో ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్నామన్నారు. ఎండ తీవ్రత బాగా ఉన్నప్పుడు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమం ఇన్‌చార్జి అరుణాప్రతాప్‌రెడ్డి, గట్టు అమర్నాథ్, వడ్డేపల్లి సుధాకర్, పెరాల రాజులు పాల్గొన్నారు.

మోదీ పథకాలు ఇంటింటికీ చేరాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్ గోపాల్‌రెడ్డి

అక్కన్నపేట, ఏప్రిల్ 26: మళ్లీ ప్రధానిగా మోదీ కావాలంటే కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్ గోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం అక్కన్నపేట మండలం అంతకపేటలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, నాయకులు జనగామ వేణుగోపాలరావు, రైనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లెక్సీలను తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి'

కోహెడ, ఏప్రిల్ 26: నియోజకవర్గంలో జేఎస్‌ఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆరోపించారు. శుక్రవారం కోహెడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సంస్థ ద్వారా నియోజకవర్గంలో 100 రోజుల్లో 20 లక్షల లీటర్ల నీరును ప్రజలకు జన్నపరెడ్డి సురేందర్ రెడ్డి అందజేశారన్నారు. సుమారు రూ 50 లక్షలు వెచ్చించి సేవా దృక్పథంతో చలివేంద్రాలు మూడు సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సంస్థ వేసిన ఫ్లెక్సీలో పార్టీ గుర్తులు కూడా లేవని అధికారులు మాత్రం తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతోనే ఈ ఫ్లెక్సీ తొలగిస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో తృతీయ బహుమతి



బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

దుబ్బాక, ఏప్రిల్ 26: రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలో దుబ్బాక డిగ్రీ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే. భవానీ, అధ్యాపకురాలు పొన్నాల సునీత తెలిపారు. రాష్ట్రస్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులను శుక్రవారం కళాశాల అధ్యాపకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన జిజ్ఞాస పోటీలో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ ద్వితీయ, తృతీయ సంవత్సరానికి చెందిన శ్రవంతి, శిరీషా, దివ్య, జైనీషా, రమ్యలు అర్థశాస్త్ర విభాగంలో నిర్మించిన 'ఆర్థిక వికాసం- పరపతి సహకార సంఘాలు, సిద్దిపేట ఆటో కో- ఆపరేటీవ్ సొసైటీ' మీద చేసిన ప్రాజెక్టుకు తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు.

మే 1 నుంచి హ్యాండ్‌బాల్ సమ్మర్ కోచింగ్

మద్దూరు, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని మే 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు సమ్మర్ కోచ్ దామెర మల్లేశం తెలిపారు. ఈ విషయమై కోచ్ మాట్లాడారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ సమ్మర్ క్యాంపులో 15 సంవత్సరాలలోపు బాల, బాలికలకు అవకాశం ఉందన్నారు. శిక్షణకు హాజరయ్యే వంద మంది బాల, బాలికలకు రూ.30 వేల విలువ చేసే క్రీడా దుస్తులు బొడిగం రాజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సీనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు బొడిగం శ్రీనివాస్‌గౌడ్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలం హ్యాండ్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించే నాయకుడు హరీశ్‌రావు

● బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 26: నిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అని చిన్నకోడూరు మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా సవాల్ విసిరిన సందర్భంగా, శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్దకు వారు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేట అభివృద్ధి ప్రదాత హరీశ్‌రావును సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాపయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకటేశం, మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకి బీజేపీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజాంపేట, ఏప్రిల్ 26: కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని ఓడిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యావారు లక్ష్మణ్ అన్నారు. ఏఐటీయూసీ పిలుపుమేరకు మండల కేంద్రంలో మేడే పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో మోసపూరిత కుట్రల, కుతంత్రాల ప్రభుత్వం నడుస్తున్నదని, ఒకప్పుడు నష్టం వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తామన్నారు. తర్వాత కల్లబొల్లి కబుర్లతో లాభాలు వచ్చే సంస్థలను అమ్మకానికి పెట్టారన్నారు. కార్మికుల వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిన బీజేపీని ఓడిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నాలం బాలగౌడ్, మండల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఎల్లయ్య, యేసు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం

గజ్వేల్, ఏప్రిల్ 26: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ గుప్తాలు ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి వెంకటేశ్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతి, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ పాల్గొన్నారు.

'కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల అభివృద్ధి'

ములుగు, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని బీఆర్‌ఎస్ ములుగు మండల అధ్యక్షుడు జహంగీర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో మెదక్ ఎంపీ వెంకట్రామారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మిని నిలిపివేసిందన్నారు. దీని కారణంగా పేదింటి ఆడబిడ్డల కుటుంబాలు ఎంతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో అర్జున్‌గౌడ్, అంజన్నగౌడ్, మాజీ సర్పంచులు గణేష్‌గుప్త, బాలేష్, జగదీశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాపురెడ్డి, వెంకట్‌గౌడ్, స్వరూప్‌రెడ్డి, నాగేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు వార్షికోత్సవం

● హాజరుకానున్న రాష్ట్ర డైరెక్టర్

నర్సాపూర్, ఏప్రిల్ 26: నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏర్పడి 44 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేడు వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో హేమభార్గవి తెలిపారు. శుక్రవారం సీడీపీవో విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్‌లోని సాయి కృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా స్త్రీశిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కంతివెస్లీ, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు తప్పక హాజరుకావాలని కోరారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శివ్వంపేట, ఏప్రిల్ 26: వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేయడం వల్ల ఎంతో లాభదాయకమని నర్సాపూర్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వెదజల్లే వరిసాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వెదజల్లే పద్ధతి వల్ల రైతులకు తక్కువ ఖర్చుతో పాటు దిగుబడి కూడా పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం, ఏవో లావణ్య, రైతులు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాలల హక్కుల సాధనే లక్ష్యం'

హత్నూర, ఏప్రిల్ 26: తెలంగాణలో మాలల హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాల విఠల్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు అన్నిరంగాల్లో వెనకబాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాలలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నారు తప్పా పదవుల పంపకాలలో అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రాష్ట్రంలోని మాలలందరినీ ఏకం చేసి హక్కుల సాధన కోసం పని చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

నారాయణఖేడ్, ఏప్రిల్ 26: ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ప్రతిభచూపిన విద్యార్థినులను శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. బైపీసీ చదువుతున్న బైజాసభ 440 మార్కులకుగాను 437 మార్కులు సాధించింది. ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని అక్షయ రాథోడ్ 470 మార్కులకుగాను 465 మార్కులను సాధించింది. ఈ మేరకు యూటీఎఫ్ నాయకులు కాశీనాథ్‌జాదవ్, నరేష్, సాయిలు విద్యార్థినులను సన్మానించారు.

సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు

జహీరాబాద్/న్యాల్‌కల్, ఏప్రిల్ 26: పెద్దశంకరంపేట మండలంలో శుక్రవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభకు జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లారు. రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, ఆయా మండలాల అధ్యక్షుల నేతృత్వంలో సీఎం సభకు భారీగా తరలివెళ్లారు.

వర్క్‌షాప్‌లు సృజనాత్మకతను పెంచుతాయి

● రిటైర్డ్ ప్రొఫెసర్ ఆనందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 26: వర్క్‌షాప్‌లు సృజనాత్మకతను పెంచుతాయని రిటైర్డ్ ప్రొఫెసర్ ఆనందరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్రం విభాగం స్పింకో బయోటెక్, ఉస్మానియా కెమిస్ట్రీ ఫౌండేషన్ వారి సంయుక్త సహకారంతో జరిగిన అడ్వాన్స్ క్రొమాటోగ్రఫీ పద్ధతులపై రెండురోజుల వర్క్‌షాప్‌నకు ఆయన హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యశాల భవిష్యత్తులో విద్యార్థులు చేయబోయే పరిశోధనకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఐఐసీటి శాస్త్రవేత్త దేబాషీష్ సైన్ అడ్వాన్స్‌డ్ క్రొమాటోగ్రఫీ పద్ధతులపై ప్రసంగించారు. మధ్యాహ్న వర్క్‌షాప్‌లో భాగంగా స్పిన్కో బయోటెక్ ప్రాంతీయ మేనేజర్ ఎస్ కృష్ణ, రీజనల్ లీడ్ అరుణ్‌సింగ్ నాద్ వారి బృందం క్రొమాటోగ్రఫీ పరికరాలపై ప్రత్యక్ష శిక్షణ, అవగాహనను కల్పించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ రసాయన శాస్త్ర విభాగాధిపతి వాసం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.బాలకిషన్, వర్క్‌షాప్ కో కన్వీనర్లు అంజనేయులు, రవికుమార్, సుమలత, శ్యాంసుందర్, సలీం పాషా, రవికుమార్, కళాశాల పరీక్ష విభాగం నియంత్రణ అధికారి గోపాల సుదర్శనం పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎం

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 26: రేవంత్‌రెడ్డి సీఎం స్థాయిలో మాట్లాడాలని, స్థాయి దిగజారి మాట్లాడవద్దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి



విలేఖరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

రాజ్యాంగంపై నమ్మకం లేదని, ప్రజలను మోసం చేయడానికి ఆగస్టు 15వ తేదీన రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఓట్లు వేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో ఎన్నుకోబడిన వక్తి ప్రజాస్వామ్యాన్ని విశ్వసించాలని అన్నారు. రుణమాఫీ, ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ఆగస్టు 15వ తేదీన రాజీనామాకు సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, 6 గ్యారంటీలను అమలు చేసినట్లయితే మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని, ఐదేళ్ల వరకు మళ్లీ ఎన్నికల్లో పోటీకి కూడా దూరంగా ఉండనున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకే ఓటమి చెందారని తెలిపారు. బీజేపీ నాయకుల కులాన్ని, మతాన్ని, దేవుని అడ్డం పెట్టుకుని ఓట్లు అడిగితే బీఆర్‌ఎస్ మాత్రం తెలంగాణకు చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతున్నట్లు పేర్కొన్నారు.

బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 26: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట పబ్లిక్ సర్వెంట్స్ హోమ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పెండింగ్లో ఉండడం వల్ల విభిన్న సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్స్‌కు గుదిబండగా మారిన టెట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత హెల్త్ కార్డుల వల్ల సంపూర్ణ ప్రయోజనం కలగడం లేదని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వి సుధాకర్ మాట్లాడుతూ.. సెలవు నియమనిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు అండగా నిలవాలని సూచించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు పున్న గణేష్, పి.ప్రవీణ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మట్టపల్లి రంగారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్, ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ ఎస్టీయూ నాయకులు ఐత అంజయ్య, నాగభూషణం, బిక్షపతి, రాజా నరసయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు తథ్యం

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య, వైశ్యసంఘం నాయకుడు కందుకూరి ఉపేందర్, బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా ఇన్‌చార్జి తాటికొండ సదానందం, న్యాయవాది భూమిగారి మనోహర్‌తో పాటు కొమురవెల్లి మండలానికి చెందిన పలువురు శుక్రవారం



సిద్దిపేట అర్బన్: కాంగ్రెస్‌లో చేరుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాస్

ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగం, ఆడెపు నరేందర్, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మంచాల చిరంజీవులు, దాసరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కాంగ్రెస్‌లోకి..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26: ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సిద్ధరబోయిన శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎన్‌ఎస్‌యూఐలో రాష్ట్ర కమిటీలో బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మిట్టపల్లి గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ చైర్మన్‌గా, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అయన ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉంటూ ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సొంత గూటికి రావడం ఆనందంగా ఉందని అన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

చిన్నకోడూరు, ఏప్రిల్ 26: ఆరు గ్యారంటీలు, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దకోడూరు శివారు మెట్టుబండల వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేస్తుంటే, ఎన్నికల సమయంలో దృష్టి మరల్చడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు రాజీనామా డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు రైతులపై ప్రేమ ఉంటే స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్, పరుశురాం, రాజు, మల్లేశం, గణేష్, రాజు, జగన్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొండపాక, ఏప్రిల్ 26: ఉమ్మడి కొండపాక కాంగ్రెస్ నాయకులు ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖను శుక్రవారం కలిసి మాట్లాడారు. ఎన్నికల సమావేశంలో భాగంగా సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో కొడకండ్ల వద్ద ఓ హోటల్లో కలిసి మండల పరిస్థితులను వివరించారు. అలాగే నాయకులు మైనంపల్లి హనుమంతరావు పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డిలను వారు కలిశారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు లింగారావు, శ్రీనివాస్‌రెడ్డి, కొయ్యడ వెంకటేష్, దుద్దెడ గ్రామ అధ్యక్షుడు పంజా అఖిల్, అడ్వకేట్ శ్రీకాంత్ గౌడ్, కొండపాక మండల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మెరుగు ప్రభాస్ ఉన్నారు.